## ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

**కవాడిగూడ , డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) :** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఎం నాగమాధవి సూచించారు. సోమవారం కవాడిగూడ డివిజన్ గగన్‌మహల్. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ పాఠశాలలో ముందస్తు కాలుష్య నివారణ దినోత్స వాన్ని పురస్కరించుకొని అప్సా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ కాలుష్య నియంత్రణపై అవగాహనను కల్పించారు. అనంతరం వారితో పాఠశాలలో మొక్కలు నాటించారు. భవిష్యత్ తరాల మనుగడ కోసం నేటి విద్యార్థులు యువత ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం వాటిని పరిరక్షించాలని నాగమాధవి సూచించారు. ఇళ్ల ఎదుట ఉన్న మొక్కలు నరికివేయొద్దన్నారు. కార్యక్రమంలో అప్సా కో ఆర్డినేటర్ బొట్టు రమేష్, అప్సా ప్రతినిధులు శ్రావణి, లావణ్య, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు వేగిరం

**ముషీరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):** ముషీరాబాద్ డివిజన్ పటాన్‌బస్తీలో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బీఆర్ఎస్ ముషీరాబాద్ సీనియర్ నాయకుడు జావిద్‌ఖాన్ జలమండలి అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం పటాన్‌బస్తీలో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను జలమండలి సెక్షన్ మేనేజర్ సురేష్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. దశాబ్దంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకెళ్లగా సమస్యను పరిష్కరించాలని జలమండలి ఉన్నతాధికారులకు సూచించారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జాఫర్‌ఖాన్, మున్నా, సయ్యద్ సర్వర్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.



బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్, అధికారులు

## బస్తీల్లో సదుపాయాలు కల్పిస్తాం

**కార్పొరేటర్ పావని**

**చిక్కడపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):** బస్తీల్లో సదుపాయాలు కల్పిస్తామని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ పేర్కొన్నారు. డివిజన్‌లో ఉన్న పలు బస్తీల్లో ప్రజల అవసరాల మేరకు చేపట్టనున్న అభివృద్ధి పనుల కోసం సోమవారం జీహెచ్ఎంసీ ఏఈ అబ్దుల్ సలామ్, వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్ సిబ్బందితో కలిసి ఆమె పర్యటించారు. వివిగిరినగర్, దోబీఘాట్, మాలబస్తీ తదితర బస్తీల్లో షాబాద్ బండలు, సీసీ రోడ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, బస్తీవాసులు నగేష్, పెంటయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి మహా కిసాన్‌మేళా

- రైతులకు ఉపయోగపడే స్టాళ్ల ఏర్పాటు
- తెలంగాణ అగ్రికల్చరల్ ఆఫీసర్స్ అసోసియేషన్ చైర్మన్ కృపాకర్‌రెడ్డి

**చిక్కడపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):** నగర శివార్లలోని కన్హా శాంతివనంలో ఈనెల 3, 4వ తేదీల్లో పీజీపీఆర్ సొసైటీ ఆధ్వర్యంలో మహా కిసాన్‌మేళా నిర్వహించామని, ఇందులో పాల్గొనేందుకు మూడు వేల మందికి పైగా రైతులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలంగాణ అగ్రికల్చరల్ ఆఫీసర్స్ అసోసియేషన్ చైర్మన్ బి. కృపాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో రైతులకు ఉపయోగపడే విధంగా పలు ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పలువురు శాస్త్రవేత్తలు, అభ్యుదయ, సేంద్రియ రైతులు కార్యక్రమంలో పాల్గొని రైతులకు ఉపయుక్తమైన సలహాలు, సూచనలు ఇస్తారని, వారి అనుభవాలను వివరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రావాలని సీఎంను ఆహ్వానించామని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల, ప్రణాళికాసంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి, రైతు కమిషన్ రాష్ట్ర చైర్మన్ కోదండరెడ్డి తదితరులు పాల్గొంటారని తెలియజేశారు. రైతులకు పురస్కారాల ప్రదానం ఉంటుందని తెలిపారు.

## ఏబీవీపీ జాతీయ కార్యవర్గంలోకి ఓయూ నేత

**ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):** ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు జీవన్ ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. డెహ్రాడూన్‌లో జరుగుతున్న 71వ జాతీయ మహాసభల్లో ఆయన పేరు అధికారికంగా ప్రకటించారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయివరకు పలురకాల బాధ్యతలు నిర్వర్తించారు. జాతీయ స్థాయిలో బాధ్యతలు దక్కడం సంతోషకరమని ఆయన తెలిపారు. నిజాం కాలేజీలో చదువుతున్నప్పటి నుంచే ఏబీవీపీలో చురుకుగా పనిచేస్తూ, తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు.

## దీపక్‌జాన్‌కు సన్మానం



దీపక్‌జాన్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు

- సికింద్రాబాద్ డీసీసీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన తెలంగాణ క్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్‌ను ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. దీపక్‌జాన్ నాయకత్వంలో సికింద్రాబాద్ జిల్లాలో కాంగ్రెస్ మరింత పటిష్టం అవుతుందని నాయకులు గడ్డం రాజేష్, ఎల్లూరి భాస్కర్‌రెడ్డి, తాళ్ళపల్లి శివకుమార్‌గౌడ్‌లు అన్నారు. **చిక్కడపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):**

## హాస్టళ్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి

**చిక్కడపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):** గాంధీనగర్ డివిజన్‌లో ఉన్న అనేక హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ డివిజన్ ఇన్‌చార్జి భవాని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. నేరాల అదుపునకు గాను ప్రతీ వ్యాపారసంస్థతో పాటు హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా వాటి నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అశోక్‌నగర్, జవహర్‌నగర్, చిక్కడపల్లిలో పుట్టగొడుగుల్లా హాస్టళ్లు వెలిశాయన్నారు. మెయిన్‌రోడ్ నుంచి రెండు కిలోమీటర్ల లోపలి ప్రాంతం వరకు కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా కృషి చేయాలని చిక్కడపల్లి, ముషీరాబాద్ పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

## వీధి దీపాలు ఏర్పాటు చేయరూ..

**చిక్కడపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):** గాంధీనగర్ డివిజన్ బాపునగర్, వివేక్‌నగర్‌లలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని సోమవారం స్థానికులు కోరుతున్నారు. 15 రోజుల నుంచి వీధిదీపాలు వెలగక పోవడంతో రాత్రి సమయంలో అంధకారం నెలకొని ఉంటుందన్నారు. దీంతో పిల్లలు, మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వివేక్‌నగర్ నల్లపోచమ్మ దేవాలయం లేన్, చిక్కడపల్లి కల్లేపల్లి లేన్‌లో వీధిదీపాలు వెలగడం లేదన్నారు. ఫిర్యాదు చేసినా కూడా పట్టించుకోవడం లేదని వాపోయారు.

## ఈవోగా బాలసుబ్రహ్మణ్యానికి పదోన్నతి

**చిక్కడపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):** చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం సీనియర్ అసిస్టెంట్ బాలసుబ్రహ్మణ్యంకు ఈవోగా పదోన్నతి లభించింది. దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. నాంపల్లి దేవీబాగ్ నల్లపోచమ్మ ఆలయంతో పాటు మరో దేవాలయం, దేవాదాయ శాఖకు చెందిన సంస్థకు ఈఓగా నియమితులయ్యారు. ఆయన్ను వేంకటేశ్వరస్వామి ఆలయం వ్యవస్థాపక వంశీయుడు రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు అభినందించారు.

## భక్తిశ్రద్ధలతో భజన, గీతాలాపన

భవానీ శంకర ఆలయంలో కైలాస సామూహిక వాయిద్య భజన, శివ భక్తి గీతాలాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బోలక్‌పూర్‌లో ఉన్న ఈ ఆలయంలో ఇషా ఫౌండేషన్ కోయంబత్తూర్ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. శివలింగానికి వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. శాఖ ప్రతినిధులు స్వామి, ఎస్టీర్, మాచిత్రవాహ, స్వామి బెకూర, భాను తదితరులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున విచ్చేశారు.
**ముషీరాబాద్, (ఆంధ్రజ్యోతి):**





శివలింగానికి పూజలు చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్‌కుమార్, ఇషా ఫౌండేషన్ ప్రతినిధులు, వాయిద్యాలను వాయిస్తున్న కోయంబత్తూర్ శాఖ కళాకారులు

# ఎయిడ్స్ మహమ్మారిని పారదోలుదాం

**డీఆర్ఎం సంతోష్‌కుమార్‌వర్మ**



కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద ఎయిడ్స్ నివారణ ర్యాలీలో డీఆర్ఎం సంతోష్‌కుమార్‌వర్మ, వైద్యసిబ్బంది

**బర్కత్‌పుర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):** ఎయిడ్స్ మహమ్మారిని పారదోలుదామని, దాని నివారణపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ డీఆర్ఎం సంతోష్‌కుమార్‌వర్మ కోరారు. దాని పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సోమవారం వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా కాచిగూడ రైల్వే స్టేషన్ ఆరోగ్య యూనిట్ ఆధ్వర్యంలో దీనిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆపై మొక్కలు నాటారు. హెచ్ఐవీతో బాధపడుతున్న వారికి మానవత్వంతో సహకరించాలని సంతోష్ కోరారు. సీనియర్ డీఎంవో డాక్టర్ బి.వేదారణ్య. ఎయిడ్స్ లక్షణలు చికిత్స గురించి తెలిపారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు డాక్టర్ పద్మ, డాక్టర్ బి.టి.నవీన్‌కుమార్, డాక్టర్ ఎం.కవిత పాల్గొన్నారు.

# వరద నీటి కాలువల ఆధునికీకరణ

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**బర్కత్‌పుర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) :** అంబర్‌పేట నియోజకవర్గంలో ఉన్న ఐదు మున్సిపల్ డివిజన్లలో వరద నీటి కాలువల ఆధునికీకరిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వర్షం నీరు రోడ్లపై నిల్వ లేకుండా ఉండేందుకు వరదనీటి కాలువలను పూర్తిస్థాయిలో నిర్మిస్తున్నామన్నారు. సోమవారం కాచిగూడ డివిజన్ మౌలానాఆజాద్‌నగర్‌లో బస్తీ దవాఖానా రూ. 10 లక్షలతో రీమోడలింగ్ షెడ్, టాయిలెట్ నిర్మాణ పనులను, రూ. 49 లక్షలతో వరదనీటి కాలువ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ కన్నె ఉమాదేవితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం బస్తీలలో ఇళ్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులను పర్యవేక్షించారు. ప్రజలెదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మాదేవ్, సీనియర్ నాయకుడు డాక్టర్ బద్దుల ఓంప్రకాష్‌యాదవ్, రవీందర్‌యాదవ్, సునీల్‌బిడ్లాన్, బి.కృష్ణగౌడ్, శేషు, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు క్షీరసాగర్, సుభాష్‌పటేల్, అరవింద్, బల్వీర్, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్ పాల్గొన్నారు.



గతి తప్పిన రుతువు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

## ఆలూరు సుభాష్‌బాబు సేవలు అభినందనీయం

**హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్**

**రాంనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):** ప్రముఖ విద్యావేత్త, ఉద్యోగ విజయాలు, సిరివెన్నెల పత్రికల సంపాదకులు డాక్టర్ ఆలూరు సుభాష్‌బాబు విద్య, ఉద్యోగ సేవలు అనితర సాధ్యమని హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ పేర్కొన్నారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్, అభ్యుదయ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థల ఆధ్వర్యంలో గతి తప్పిన రుతువు పుస్తకావిష్కరణ, జాతీయ ప్రతిభా లెజెండరీ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ప్రముఖ కవి డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జస్టిస్ బి.చంద్రకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రచయిత్రి డా.శైలజ సాహసంతో నవలను రాశారని ప్రశంసించారు. బీసీ కమిషనర్ పూర్వ చైర్మన్ బి.ఎస్. రాములు, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్నలు మాట్లాడుతూ నవల యుక్త వయసులో ఉన్న యువతుల్లో చైతన్యం కల్పించేలా రచయిత్రి ఆవిష్కరింపచేశారని అభినందించారు. ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ఆలూరు సుభాష్‌బాబుకు మహామహోపాధ్యాయ విద్యా ఉద్యోగ కల్పనా సార్వభౌమ బిరుదుతో పాటు జాతీయ జీవన సాఫల్య లెజెండరీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మామిడాల శైలజ రాసిన గతి తప్పిన రుతువు నవలను ఆవిష్కరించి రచయిత్రిని సత్కరించారు. అనంతరం సినీ దర్శకులు నాగేష్ నారదాసి, బాణాల వెంకటేశ్వరరావు, డాక్టర్ శాంతిశ్రీ, మారేపెల్లి భువనేశ్వరి, బి.సుజాత, డాక్టర్ రమణ యశస్వి, స్వర్ణాగౌడ్, డాక్టర్ రఘు ఆరికపూడి తదితరులకు జాతీయ జీవనసాఫల్య పురస్కారాలను ప్రదానం చేశారు.

## శ్రీకాంతాచారి వర్ధంతికి ఏర్పాట్లు

**అంబర్‌పేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి వర్ధంతిని ఈ నెల 3న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలంగాణ ఉద్యమ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్సన్, ప్రధాన కార్యదర్శి పిండిగ వెంకన్నలు సోమవారం తెలిపారు. ఎల్‌బీనగర్‌లో ఉన్న శ్రీకాంతాచారి విగ్రహం వద్ద ఇదేరోజు ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యమకారులందరూ పాల్గొనాలని కోరారు.



మాట్లాడుతున్న నాళేశ్వరం శంకరం, పక్కన కళా జనార్దనమూర్తి

## ఉన్నవ లక్ష్మీనారాయణ ఆదర్శనీయుడు

**చిక్కడపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):** స్వాతంత్ర్యయోధుడు, రచయిత, సంఘసేవకులు ఉన్నవ లక్ష్మీనారాయణ ఆదర్శనీయుడని, చేసిన సేవలు మరువలేనివని ప్రముఖ సాహితీవేత్త, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. నాళేశ్వరం శంకరం అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎందరో మహానుభావులు శీర్షికలో భాగంగా సోమవారం సాయంత్రం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన గాంధేయవాది, సంఘసంస్కర్త తెలుగు నవలా సాహిత్య వైతాళికుడు ఉన్నవ లక్ష్మీనారాయణ యాదిలో కార్యక్రమం జరిగింది. గుంటూరులో జన్మించిన లక్ష్మీనారాయణ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం ప్రారంభించడంతో పాటు న్యాయవాదిగా పనిచేశారని గుర్తుచేశారు. వితంతు శరణాలయం స్థాపించి గుంటూరులో తొలి వితంతు వివాహాన్ని జరిపించారన్నారు. బాలికలకు విద్యావకాశాలు అందించారని గుర్తు చేశారు. ఆయన రాసిన ప్రసిద్ధ నవలల్లో మాలపల్లి నవల ప్రత్యేకమైందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ మహనీయుల జీవితాలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని సమాజప్రగతికి తమవంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘసేవకులు భవాని శ్రీనివాస్, గిరి ప్రసాద్ శర్మ, గాయకుడు పేరి నాగేశ్వరరావు, యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అతివేగానికి నిండు ప్రాణం బలి

- డివైడర్‌ను ఢీకొట్టి.. ఫ్లైఓవర్ పై నుంచి పడి..

**సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుర్మరణం**

**బర్కత్‌పుర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) :** బైక్ అతివేగానికి నిండు ప్రాణం బలైంది. డివైడర్‌ను బైక్‌తో ఢీకొట్టి.. ఫ్లైఓవర్ నుంచి కింద పడి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో ఛేనంబర్ చౌరస్తా పెట్రోల్ బంకు వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగింది. కాచిగూడ ఎస్ఐ భరత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణగూడలో నివాసం ఉంటున్న శిరీష్ (33) పూణేలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఆదివారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో రామంతపూర్‌లో నివాసం ఉంటున్న తన స్నేహితుడి వద్దకు నారాయణగూడ-కాచిగూడ మీదుగా ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. అంబర్‌పేట ఫ్లైఓవర్‌పై అతివేగంగా వాహనం నడిపి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఎగిరి ఫ్లైఓవర్ పై నుంచి కింద పడ్డాడు. ఇది ఛేనంబర్ చౌరస్తా కాగా ఈ ప్రాంతంలో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న కాచిగూడ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ఆయా రంగాల్లో సేవలకు దక్కిన గౌరవం

**ధర్మారావుకు సన్మానం**




ధర్మారావును సన్మానిస్తున్న అతిథులు

**చిక్కడపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):** సాంస్కృతిక, సాహితీ కార్యక్రమాల ద్వారా సేవ చేస్తున్న ఇట్కులా సంస్థ అధ్యక్షుడు, వ్యవస్థాపకుడు డా.కె.ధర్మారావును సోమవారం రాత్రి జిత్‌మోహన్‌మిత్ర మండలి ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ రాజమండ్రి నగర శివారు వాసి అయిన డా. ధర్మారావు పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. తెలుగు, సాంస్కృతిక, సాహిత్య, సినిమా రంగాలకు చేసిన సేవలు విలువైనవన్నారు. సామాజిక సందేశం ఉన్న లఘుచిత్రాన్ని నిర్మించిన గొప్ప వ్యక్తి ధర్మారావు అని అన్నారు. ఆంజనేయులు, జిత్‌మోహన్‌మిత్ర, పట్టాభికుమార్, హేమమాలిని, నాగేంద్ర, గోవింద్, జగపతి తదితరులు మాట్లాడుతూ ధర్మారావు రాజమండ్రి కళాభరణం అని ప్రశంసించారు.

## ప్రతీవిద్యార్థికి హాస్టల్ సౌకర్యం

**బీసీ జేఏసీ డిమాండ్**

**ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):** వర్సిటీలో సీటు పొందిన ప్రతి విద్యార్థికి వయసు పరిమితి లేకుండా హాస్టల్ సౌకర్యం కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్.. సీఎంకి సోమవారం లేఖ రాశారు. ఈ అనాలోచిత నిర్ణయంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.



- ఖైరతాబాద్ డీసీసీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన మోతే రోహిత్ ముదిరాజ్‌ను కాంగ్రెస్ గోల్నాక డివిజన్‌కు చెందిన సీనియర్ నాయకులు భావి ధన్‌రాజ్, పి.సుదర్శన్‌లు కలిసి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.
- (గోల్నాక డిసెంబరు 1 ఆంధ్రజ్యోతి)



మాట్లాడుతున్న సాయిబాబా తదితరులు

## హామీలు నెరవేర్చకుండా ప్రజాపాలన ఉత్సవాలా?

**టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సాయిబాబా**

**రాంనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):** గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఈనెల 9 వరకు ప్రజాపాలన ఉత్సవాలు నిర్వహించడం తగదని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా పేర్కొన్నారు. సోమవారం టీడీపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు పూర్తిగా అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజాపాలన ఉత్సవం నిర్వహించడం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన మహిళలకు ఇస్తామని చెప్పిన 2,500 రూపాయల ఆర్థిక సహకారం, కొత్త పెన్షన్ పూర్తిగా రుణమాఫీ చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, ప్రకాష్, కిరణ్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్‌టీఎఫ్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా విజయభాస్కర్



**గోల్నాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) హైదరాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శిగా డాక్టర్ ఎస్. విజయభాస్కర్ ఎన్నికయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిత్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రచయితగా, కవిగా ముందుకు సాగుతూ పలు సామాజిక సేవా కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. తనపై నమ్మకం, విశ్వాసంతో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## ఘనంగా గీతా జయంతి వేడుకలు

**చిక్కడపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):** గీతాజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మార్గశిర శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం వివేక్‌నగర్.. జనతా పార్కులో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు టి. గోపాల్, మాజీ కార్పొరేటర్ టి. శైలజాగోపాల్ ఆధ్వర్యంలో రేస్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుడు అర్జునునికి భగవద్గీతోపదేశం చేసింది ఈ ఏకాదశిరోజే అని, దీన్ని గీతా జయంతిగా ఆదరిస్తారని గోపాల్ అన్నారు. ఈరోజు భగవద్గీతను పూజించి గీతా పారాయణం చేస్తే సత్ఫలితాలు పొందవచ్చన్నారు. ప్రముఖులు వాణీశ్వరశాస్త్రి, సత్యం దోనేటి, నాగేశ్వరరావు, రామకృష్ణ, కనకతార, పద్మ, లాస్య తదితరులు పాల్గొన్నారు.



సుధాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దర్శకుడు నరసింహారావు, రామసత్యానారాయణ, వంశీ రామరాజు

## రచయిత్రి సుధాదేవికి ఘననివాళి

**నల్లకుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) :** ప్రముఖ రచయిత్రి డాక్టర్ తెన్నేటి సుధాదేవికి ప్రముఖ సినీ దర్శక, నిర్మాతలు నివాళులు అర్పించారు. సోమవారం సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, సినీ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ఫాస్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ కె.ధర్మారావులు.. నల్లకుంటలో ఉన్న ఆమె నివాసానికి చేరుకొని ఆమె భర్త వంశీ రామరాజు, కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపం తెలిపారు.

## అలరించిన గానలహరి

**చిక్కడపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):** కొణిదల రాధ, అరుణ పింగళి నిర్విరామ భక్తిగానలహరితో శ్రోతలను తన్మయులను చేశారు. మధురమే మ్యూజికల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో నిర్వహించిన కార్యక్రమం ఆదివారం ఉదయం నుంచి సాయత్రం వరకు జరిగింది. సినీ భక్తిగీతాలతో పాటు కీర్తనలు మధురంగా ఆలపించారు. ప్రముఖ సంగీత గురువు సంయుక్త ఈ సందర్భంగా గాయనీమణులను అభినందించారు. కళా జనార్దన మూర్తి దైవజ్ఞశర్మ పాల్గొన్నారు.